


**కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఉద్యమించాలి**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 28 మార్చి, 2025 | పేజీలు : 06

# నిప్పుల కొలిమి నీలగిరి..



### రెండు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు.. బయటకు రావాలంటేనే భయపడుతున్న జనం

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** ప్రచండ భానుడి సెగలు పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి..ఉదయం ఏడు గంటల నుంచే ఎండవేడిమి ఎక్కువగా ఉంటోంది... గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు... ఉష్ణోగ్రతలు 43. డిగ్రీలకు చేరడం, వడగాలులు పెరగడంతో వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు.భానుని ఉగ్ర రూపానికి నీలగిరి విలవిలాడుతోంది. వారం రోజుల క్రితం పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు చేరినప్ప టికీ ఇటీవల కాలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.. దీంతో పగటి ఉష్ణోగ్రతలు. 28 డిగ్రీలకు తగ్గడంతో ప్రజలు ఊరట చెందారు. తిరిగి సోమవారం నుంచి పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగి పోతున్నాయి. గురువారం అత్యధికంగా, 43.0 డిగ్రీల 25.0 సె ల్సియస్‌లుగా నమోదుకావడం తో ఆందోళన కలిగి స్తోంది. ఒక్కసారిగా భానుడు ఉగ్రరూ పం దాల్చడంతో ప్రజలు బయటకు వెళ్ల లేక చాలా మంది ఇళ్లకే వరి మితమవుతు న్నారు. ఉదయం 9 గంటల నుంచే వడ గాలులు వీస్తుండంతో బయటకు వెళ్లా లంటే జంకుతున్నారు. మధ్యాహ్నం 12 ఎండ తీవ్రతతో గడియారం సెంటర్ తో పాటు పలు ప్రధాన రోడ్లన్నీ సాయంత్రం 5 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పని మీద బయటకు వెళ్లాలనుకునే వారు మాత్రం సాయంత్రం 5 తరువాతే బయటకు వెళ్తున్నారు.దీంతో పాటు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోత విధిస్తుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. రాత్రి పది గంటల వరకు కూడా వాతావరణ చల్ల బడకపోవడంతో, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వడగాల్పులు, ఉక్కపో తతో కంటి మీద కునుకులేకుండా ప్రజ లు అవస్థలకు గురవుతున్నారు. వర్షాలు కురిస్తేగాని వాతావరణ చల్లబడే అవకాశం ఉంది. అప్పటి వరకు ప్రజలకు అవస్థలు తప్పే పరిస్థితి కనబడడం లేదు., మార్చిలోనే ఎండలు ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎండల ఈ విధంగా ఉంటాయోఅని ప్రజలు భయపడుతున్నారు,



## ఉరేసుకుని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** ఉరి వేసుకోని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని గంద్రవానిగూడెం గ్రామంలో బుధవా రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాడ్గుల పల్లి మండలం గంద్రవానిగూడెం గ్రామానికి చెందని కంచర్ల లచ్చిరెడ్డి (50) గత కొన్ని నెలలుగా మతిస్థిమితం లేక తిరుగుతూ ఉండేవాడు. కొన్ని రోజుల క్రితం రాత్రి సమయంలో దేవతలబావిగూడెంకు వెళ్లడంతో కుటుంబసభ్యులు వెతికి తీసుకొచ్చారు. బుధవారం మేకలను మేపుకోని ఇంటికి వచ్చిన లచ్చిరెడ్డి తిరిగి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తమ వ్యవసాయ పొలం వద్దకు వెతకగా వేప చెట్టుకు ఉరి వేసుకొని మృతిచెంది కనిపించాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు సూర్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.


## చెరువు కలుషిత మవుతున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు




**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో గల బీబీనగర్ పెద్ద చెరువు డ్రైనేజీ వాటర్‌తో కలిసి కలుషితమైపోతుందని పట్టించుకోని ప్రజాప్రతినిధులని బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు పిట్టల అశోక్ విమర్శించారు. గురువారం బిఆర్ఎస్ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు గోలి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి అధికారంలోనికి రాకముందు చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇచ్చినప్పటికీ అధికారం రాగానే అభివృద్ధిని మరిచారని విమర్శించారు. అధికారం చేపట్టి రెండు సంవత్సరాల కాలం పూర్తి కావస్తున్న కేవలం గతంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి ప్రజలకు కనబడుతుందని ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పట్టించుకోవడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు గుంటుపల్లి లక్ష్మి నారాయణ, ఎరోల్ల కృష్ణ, దేవరకొండ శ్రీనివాస్, కట్ట నరేష్, చింతపట్ల నరహరి, వంగరి పరంకుశం, కుశంగల మురళి, బోయిన కృష్ణ, పంజాల ఈశ్వర్ గౌడ్, పొట్ట శ్రీనివాస్, పేరబోయిన నరేష్, మర్రి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### గిరిజన రైతుబిడ్డకు గెజిటెడ్ ఉద్యోగం

## భౌతిక శాస్త్రంలో డాక్టరేట్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** జిల్లాలోని సీత్యా తండ గ్రామానికి చెందిన వాంకుడోత్ నాగేందర్ కు భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి. నరేష్ రెడ్డి తెలిపారు. అభివృద్ధికి అందనంత దూరంలో గిరిజన తండాలో పుట్టిన వాంకుడోత్ నాగేందర్ కు ఫిజిక్స్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఆన్ స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ గడలోనియం అండ్ యాట్రియం సబ్టిట్యూట్ ఆర్థోఫెర్రైట్స్ అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, ఆడిట్ సెల్ డాక్టర్ ఎం శ్రీనాథ్ రెడ్డి పర్యవేక్షణలో తన పరిశోధనను కొనసాగించి పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించడం జరిగింది. పరిశోధనను పరిశీలించిన విశ్వవిద్యాలయం వాంకుడోత్ నాగేందర్ కు డాక్టరేట్ ప్రకటించింది.ఒకవైపు తన పరిశోధన కొనసాగిస్తూనే మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నదమయ్యారు. ఇటీవలే జూనియర్ లెక్చరర్ గా జాయినింగ్ ఆర్డర్ అందుకుని జనగామ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో విధుల్లో చేరారు. ఈయన నల్లగొండ జిల్లా, మాడుగుల పల్లి మండలం, సిత్యా తండా అనే గ్రామంలో వాంకుడోత్ మోతీరాం పద్మ దంపతులకు రెండో సంతానంగా జన్మించారు. జీవితంలో ఎవరికీ తలవంచకుండా అనేక ఆటుపోట్లను ఎదిరించి నేడు పిహెచ్‌డి పట్టాను, గెజిటెడ్ ఉద్యోగాన్ని ఒకేసారి సాధించడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏప్రిల్ 2న బిసిల పోరుగర్జన

**ప్రజా పక్షం/ నల్లగొండ :** పార్లమెంట్ లొ బిసిల బిల్లు ను ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి ఆమోదించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బిసి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏప్రిల్ 2న బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టే బీసీల పోరు గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బిసి కులగలను పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ను ప్రవేశపెట్టి ఆమోదించాలన్న డిమాండ్‌తో ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బిసిల పోరు గర్జన కు బిసిలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో జిల్లా ప్రధాన కార్యదర్శి నెలపట్ల సత్యనారాయణ,గౌరవ అధ్యక్షులు కంది సూర్యనారాయణ, కార్యనిర్వాక అధ్యక్షులు కాసోజు విశ్వనాథం, కోశాధికారి నల్ల సోమమల్లయ్య, నకెరేకంటి కాషయ్య గౌడ్ ,చిక్కుళ్ళ రాములు ,గుండా కోటప్ప ,పడుపులేటి సీతారాములు ,జెల్లా అధినారాయణ,నల్ల మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మండల పరిధిలోని జోగ్యతండాలో గత పది సంవత్సరంల కాలం నుండి డ్రైనేజి సమస్యతో తండా వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని కొల్‌ముంతల్‌పహాడ్ మాజీ ఎంపిటిసి రమావత్ రాణి రాజునాయక్ అన్నారు. డ్రైనేజి సమస్యను గత వారం ఎంఎల్‌ఏ బాలునాయక్ దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి డ్రైనేజి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వారు అన్నారు. డ్రైనేజి సమస్యకు పరిష్కారం చూపడంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు.

## 200 పోస్టులకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు జిల్లా ఉపాధి కల్పన శాఖా వారి ఆధ్వర్యంలో Foxconn Interconnect Technologies, Hyderabad వారు 200 పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.సాహితి తెలిపారు. అర్హత, ఆసక్తి గల యాదాద్రిభువనగిరి జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా లేదా రెస్యూమ్‌తో పాటు, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, రూమ్ నెంబర్ F8, మొదటి అంతస్థు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయము, న్యూ కలక్టరేట్, యాదాద్రి భువనగిరి జిల్లా నందు తేది :29/03/2025న ఉదయం 11:00 గంటలకు, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా కోరుతున్నారు.

## యాదగిరి గుట్ట డిపో మేనేజర్‌గా మురళీ కృష్ణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సిఎచ్ మురళీ కృష్ణ గురువారం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి వద్ద సేవలందించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆర్టీసీ డిపో కార్మికులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డిపోకు మంచిపేరు తేవాలని ఆయన కోరారు. నూతన డిపో మేనేజర్ మురళీ కృష్ణ కు డిపో సిబ్బంది ముత్యాలు, మనోజ్ కుమార్, శ్రీనివాస్‌లు స్వాగతం పలికారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన కందుల ముత్తి లింగమ్మ అనారోగ్యంతో మరణించడంతో గురువారం వారి కుటుంబ సభ్యులకి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ల రేపాక గ్రామ ప్రముఖులు, యువత, ఏజేఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం వెంకం భావి తండ గ్రామానికి చెందిన పానుగోత్ గోవర్ధన్(38) 10 సంవత్సరాల క్రితం కట్టెల కోసమని అడవికి వెళ్ళిన సమయంలో చెట్టు పైనుండి కిందపడి మంచానికే పరిమితమయ్యాడు. లేవలేని స్థితిలో ఉన్న గోవర్ధన్ పరిస్థితిని తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్ఫూర్తితో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముద్దను నరసింహ గోవర్ధన్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ పరిస్థితులు తెలుసుకొని పరామర్శించి ఆయన పడుకునేందుకు సౌకర్యంగా వాటర్ బెడ్, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కరెంటోత్ శ్రీను, నాయకులు గుప్త ప్రేమ్చందర్ రెడ్డి, దోనూరు జయపాల్ రెడ్డి, నోముల మాధవరెడ్డి, బిక్షపతి నాయక్, కిషన్, బాలు, రమేష్, ఉప్పల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై అవగాహన



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** సైబర్ నేరగాళ్లు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ వెంకయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ఆన్ లైన్ బెట్టింగ్‌పై పోలీస్ కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అదే సమయంలో సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత వివరాలను ఇతరులకు చెప్పవద్దనిన్నారు. సైబర్ నేరాలపై 1930, మహిళలు, బాలికలు వేదింపులకు 100కు ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఉమారెడ్డి, కానిస్టేబుల్ రవి కుమార్, రమేష్, సాయి, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జీ యల్లయ్య, గోపయ్య, ఈశ్వరచారి, కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. నారాయణ కళాశాలను సీజ్ చేసి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భాను నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 202526 విద్యా సంవత్సరానికి ఏలాంటి అనుమతులు లేకున్నా జిల్లా వ్యాప్తంగా బోర్డులు ఏర్పాటు చేసి అడ్మిషన్లు తీసుకుంటున్నారని చెప్పారు. వెంటనే విద్యాశాఖ అధికారులు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు ఉదయ్, మహేష్, నవీన్, వేణు, పవన్ పాల్గొన్నారు.

## దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** దేశంలో క్రైస్తవులకు రక్షణ కరువైందని ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు మీసాల గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడానికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ మత పెద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని, ఆయన మరణంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌డిఏ కుటమి ప్రభుత్వం ప్రవీణ్ పగడాల మరణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పోలీస్ అధికారులు ఏలాంటి వత్తిడికి లోను కాకుండా దర్యాప్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మైనార్టీ నాయకులు పి పూర్ణశశికాంత్, పూజర్ల సామేల్ కిరణ్, లాజర్ నాయక్, రమేష్ బాబు, అనిల్ కుమార్, పీటర్ బాబు, సోలోమోను రాజు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజే (ఐజెయు) నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రభాకర్

**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టియుడబ్ల్యూజే (ఐజెయు) మునుగోడు నియోజకవర్గం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా రాపోలు ప్రభాకర్ , ముదుపు శ్యాంమ్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. చండూరులోని రాజశ్రీ బంకెట్ హాల్లో కేసాని శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ సమావేశంలో నూతన కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న సమక్షంలో ఎన్నిక చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడుగా మహేశ్వరం సతీష్ , అధ్యక్షుడుగా చండూరు పట్టణానికి చెందిన రాపోలు ప్రభాకర్ , ఉపాధ్యక్షులుగా సంగెపు మల్లేశం ముద్ద శ్రీనివాస్ , జాజుల స్వామి , నక్క శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా ముదుపు శ్యామ్ రెడ్డి , సహాయ కార్యదర్శులుగా కర్నాటి వెంకటేశం , దొమ్మాటి కృష్ణ , పల్లె యాదయ్య, ఈడెం గణేష్, కోశాధికారిగా సంగెపు మల్లికార్జున్‌లు ఎన్నికైయ్యారు. ఈ సమావేశంలో ఆకుల రఘుమయ్య, ఎరుకల వంశీకృష్ణ, ముత్యాలు, వెంకన్న, ప్రభాకర్, మహేష్, నల్ల స్వామి, గంట శ్రీనివాసులు , మాదగోని ఆంజనేయులు , ఇంద్రసేనారెడ్డి, గాలింక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఇఓ భాస్కర్



**ప్రజాపక్షం/వలిగొండ :** నాగారం యుపిఎస్ పాఠశాలను ఎంఈఓ సుంకోజు భాస్కర్ సందర్శించి విద్యార్థుల విద్య ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ ఏడవ తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్ బహూకరించారు. భవిష్యత్తులో కూడా తన వంతు సహకారం ఉంటుందని విద్యార్థులు వీటిని ఉపయోగించుకోవాలని, ఉన్నత విద్యను అభ్యసించాలని, విద్యకు, ఆటలకు, అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి, ఉపాధ్యాయులు గులాం జిలాని, జి.స్వామిరాజు, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.



## యూనివర్సిటీ టాపర్‌కు రూ.10వేలు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** మహాత్మగాంధీ యూనివర్సిటి మూడవ సెమిస్టర్ పరీక్షల్లో 10/10 జిపిఎ సాధించిన మహర్షి డిగ్రి కళాశాల విద్యార్థిని యాకమ్మకు కళాశాల యాజమాన్యం గురువారం రూ. 10వేల ప్రోత్సహాకాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పల్లె నగేష్, కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ర మమాదేవిలు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చే విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తామన్నారు. ఏ సెమిస్టర్‌లోనైనా 10/10 జిపిఎ మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, రూ. 10వేల ప్రోత్సాహకం అందజేస్తామని ప్రకటించారు. చదువులో ప్రతిభ కనబర్చే విద్యార్థులకు తమ సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2న 'హలో బిసి.. చలో ఢిల్లీ'

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌ను దేశ వ్యాప్తంగా పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఫ్రిల్ 2న నిర్వహించే హలో బిసి.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పెంచడం హర్షణీయమన్నారు. దేశంలో మిగతా ఎన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

## టోల్ ప్లాజా నూతన భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** మండలంలోని నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై నామ్ ఎక్స్‌ప్రెస్‌వే నూతనంగా నిర్మించిన టోల్‌ప్లాజా భవనాన్ని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, క్యూబ్ హైవే సీవోవో డాక్టర్ భగవాన్‌రాజుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాల జోన్లను గుర్తించి ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ గణేష్, డిప్యూటీ ప్రాజెక్టు హెడ్ ప్రసాద్, సీనియర్ మేనేజర్ ముకేష్, ప్లాజా మేనేజర్ వెంకటేశ్వర్లు, మేనేజర్స్ రాము, షాదుల్లా, మల్లేష్, నరేష్, నామ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన సన్‌షైన్ విద్యార్థులు



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన తెలంగాణ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో స్థానిక సన్‌షైన్ పాఠశాలకు చెందిన విద్యార్థి దాచెపల్లి వెంకట్‌సాయి అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం గెలుపొందాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న గురువారం పాఠశాలలో దాచెపల్లి వెంకట్‌సాయికి మెమెంటో అందజేసి అభినందించారు. సన్‌షైన్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చుతూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మా , ప్రిన్సిపాల్ రవికాంత్, ప్రవీణ్ ,లతీఫ్ పాష ,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మండల వ్యాప్తంగా పేరుకుపోయిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం భూధాన్ పోచంపల్లి మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గురువారం పోచంపల్లి నుండి భువనగిరికి వెళ్లే రోడ్డును డబల్ రోడ్డుగా మార్చాలని, పెద్దరావులపల్లి నుండి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు పాద యాత్ర నిర్వహించి, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు అంజి రెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, మాజీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, పట్టణ, మండల కమిటీ సభ్యులు వద్దేపల్లి యాదగిరి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ప్రజాపక్షం/కోదాడ : కోదాడ పట్టణంలోని స్థానిక కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. స్కిల్ ఇంటెన్ కంపెనీలో 31 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి వార్షిక వేతనం 5.2 లక్షలు ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ నాగార్జునరావు అభినందించి మాట్లాడారు. సెలక్టైన విద్యార్థులు ఆరు నెలల ఇంటెన్షిప్ పూర్తి చేసుకుని మంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. మార్చిలో జరిగిన ఈ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 4వ తేదీన కంపెనీలో జాయిన్ కావాలని కోరారు. ఈ ఎంపికలకు కృషి చేసిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజాజ్, ఉపాధ్యాయులను అభినందించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగపడేలా టిజిఓ డైరీ

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: టిజిఓ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం డైరీ ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ఓవి రమేష్ బాబు అన్నారు. గురువారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా పాండు నాయక్, నాయకులు పలువురు జిల్లా అధికారులకు డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల చరవాణి నెంబర్లతో పాటు అధికారులకు కావాల్సిన సమాచారం డైరీలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శివ ధర్మతేజ, అధికారులు, సంఘం నాయకులు హరికృష్ణ, రవి కిషన్, రాజు, గురువయ్య, స్వప్న, మల్హార్, లింగయ్య, ఉమమహేశ్వర్, సురేష్, చరణ్, సంధ్యారాణి, సాహితి పాల్గొన్నారు.



# పేదలపై పోలీసుల జులుం సరైంది కాదు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: పేదల ఇండ్ల స్థలాల కోసం పోరాటం నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమ అరెస్టు చేయడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను, 350 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న రామోజీ ఫిలింసిటీ యాజమాన్యంపై పాలకులు వత్తాసుపలకడం సరైంది కాదన్నారు. పేదలపై పోలీసులు జులుం చేయడం హేయమైన చర్య అన్నారు. రామోజీ ఫిలింసిటీ వద్ద ర ంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంకు చెందిన నాగన్ పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. కానీ ఆముల మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, చుట్టూ గోడ నిర్మించిందన్నారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ స భ్యులు వీరబోయిన రవి, జిల్లా నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్ర విచారణ



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు ఇరుగు సంసోన్, బిషప్ దుర్గం ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ చౌరస్తాలో ప్రవీణ్ పగడాల హత్యకు పట్ల రీచ్ ఇండియా సంస్థ చైర్మన్ రెవ. ధరావత్ లాకు రేణుక బాయి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవ నాయకులు ప్రవీణ్ పగడాల హత్యకు పాల్పడిన నిందితులను ఏపి ప్రభుత్వం వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు క్రైస్తవ సమాజం అలుపెరగని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ నాయకులు బొల్లు జాన్ పాల్, పంది మార్క్, స్పర్జన్ రాజు, పాల్వాయి అజయ్, సామేల్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పద్మావతికి మంత్రి పదవి ఇవ్వాలి



ప్రజాపక్షం/కోదాడ: ఎమ్మెల్యే పద్మావతికి మంత్రి పదవి ఇచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచాలని, ప్రస్తుతం జరగబోతున్న మంత్రివర్గ విస్తరణలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు లు అన్నారు. గురువారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఉన్న ఏకైక మహిళ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయి మెజార్టీతో గెలిచిన పద్మావతికి మంత్రి పదవికి పూర్తి అర్హురాలు అని అన్నారు. ఉన్నత విద్యావంతురాలై అసెంబ్లీలో పేదల గొంతుకగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని కోదాడ నియోజకవర్గ ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆమెకు మంత్రి పదవి ఇస్తే మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించినట్లు అవుతుందని, అవినీతి ఆరోపణలు లేకుండా పూర్తి పారదర్శకంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పద్మావతికి మంత్రి పదవితో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గంధం యాదగిరి, పెండెం వెంకటేశ్వర్లు, షాబుద్దీన్, కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, మదార్‌సాబ్, షఫి, సుబ్బారావు, కోటిరెడ్డి, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి



ప్రజాపక్షం/మునగాల: గ్రామాలాభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కోదండరామాపురం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి ఐదులక్షల రూపాయలతో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో గ్రామాలన్ని కుంటుపడ్డాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామాలన్ని అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని అన్నారు. జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలె సామేల్,ఉప్పుల జానకిరెడ్డి, సుంకి లక్మారెడ్డి, బొబ్బిలి వెంకటరెడ్డి,సుంకి కృష్ణారెడ్డి, యూత్ మండల అధ్యక్షులు తక్కెళ్లపాటి సాయి, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గొప్ప మహానుభావుడు బొమ్మగాని

ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండల కేంద్రంలో ధర్మభిక్షం 14వ వర్ధంతిని అడ్డగూడూరు సిపిఐ మండల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సిపిఐ జిల్లా సమితి సభ్యులు రేఖల శ్రీనివాస్, ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ భిక్షం సాయిధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించి నైజాం నవాబుని తరిమికొట్టిన గొప్ప మహానుభావుడు అని తన జీవితకాలమంతా నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసిన గొప్ప ప్రజా నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మాజీ మండల అధ్యక్షులు యాదగిరి, విద్యార్థి నాయకులు వంశీ కుమార్, శివరాజ్, తరుణ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలపై అవగాహన



ప్రజాపక్షం/వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బుధవారం రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు వేసవి కాలంలో దొంగతనాల నివారణ గురించి ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి సమయాలలో ఆరు బయట నిద్రించేటప్పుడు ఒంటిపై విలువైన ఆభరణాలు ధరించకూడదని, ఊరికి వెళ్లే సమయాలలో ఇంటిలో విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదు ఉంచకూడదని, బ్యాంక్ లాకర్‌లో లేదా భద్రమైన చోట దాచుకోవాలని అన్నారు. ఇంటిలో సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకొని డివిఆర్‌ని రహస్య ప్రదేశాలలో భద్రపరచుకోవాలని సూచించారు. ఎవరి మీదనైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 100/112 కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ ఎస్సై వి.యుగేందర్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/చండూరు: చండూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన చండూరులో మాట్లాడుతూ చండూరు గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు , హోటల్లు ,బౌల అంతస్తుల భవనాలు ,వ్యాపార సముదాయాలు ఉన్నాయని ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 37 కిలో మీటర్ల దూరంలో ఉన్న నల్లగొండ నుంచి అగ్నిమాపకం రావడానికి ఆలస్యం అవుతున్నందున అప్పటికే విలువైన ఆస్తులు కాలి బుడిద అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ప్రజాపక్షం/చండూరు: కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బిజెపి చండూరు మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో అర్హులైన లబ్ధిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు , అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కాసాల జనార్దన్‌రెడ్డి, యువమోర్చ రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, జెట్టి యాదయ్య , నల్పరాజు యాదగిరి , నిమ్మల భిక్షం, వెంకటేశం , సత్తయ్య ,మోహన్ కుమార్ , మల్లేశం తదితరులు పాల్గొన్నారు.





## జనార్ధన్‌రెడ్డికి నివాళులు


**ప్రజాపక్షం/తుంగతుర్తి(అర్వపల్లి):** అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీ సూర్యదేవాలయ వ్యవస్థాపకులు కాకులారపు జనార్ధన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆయన పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుం బ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు

## దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవ కమిటీ సభ్యులుగా కంక ఎలెందర్



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించిన తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కంకల ఏలేందర్‌కు రాష్ట్ర ప్రభు త్వ గుర్తింపు నిస్తూ.. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవ కమిటి సభ్యుడిగా డాక్టక్ కంకల ఏలేందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా డాక్టర్ కంకల ఎలేందర్‌కు పులవురు శుభాకాంక్షలు తెలిపారు.

## జంకుతండాలో కోతుల బెడద



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని జంకు తండాలో కోతులు స్వైర విహారం చేస్తున్నారు. కోతులు ఇండ్లలో ప్రవేశించి మహిళలు, చిన్నారులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కోతులు ఇండ్లలో ప్రవేశించి వస్తువులను అపహరించుకుపోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కోతుల బెడదతో తాము ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేండ్ల నుంచి కోతుల బెడద ఉన్నామని అధికారులు స్పందించి కోతులను పట్టుకోని అడవుల్లో వదిలి తమ ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

## రంజాన్‌కిట్ల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని జ్యోతిబా పూలే భవనంలో రంజాన్ మాసం సందర్భంగా తన తండ్రి మారం నాగభూషణం జ్ఞాపకార్ధంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు విద్యుత్ ఉద్యోగి మారం శ్రీనివాస్ అన్నారు. గురువారం రంజాన్ మాసం సందర్భంగా తన తల్లి మారం రంబాయమ్మతో కలిసి పేద ముస్లీంలకు రంజాన్‌కిట్లు అందచేశారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు, హమీద్, వస్కుల మట్టయ్య, హఫీజ్ తదితరులు ఉన్నారు.




## బిటిరోడ్ల నిర్మాణం చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** చీమలకొండూరు నుండి ముస్త్యాలపల్లి వరకు అదేవిధంగా చీమలకొండూరు నుండి చొల్లేరు వరకు బీటీ రోడ్లు, చీమల కొండూరు నుండి మోటకొండూరు వరకు రోడ్డు నిర్మాణం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా పై రెండు రోడ్లను పరిశీలించి అంజయ్య మాట్లాడుతూ చీమలకొండూరు నుండి ముస్త్యాలపల్లి వరకు వీటి రోడ్డు నిర్మాణం కోసం గత ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే ఇద్దరు శంకుస్థాపనలు చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. 1990లో అప్పటి ప్రభుత్వం 252 సర్వే నెంబర్లు 36 మంది లబ్ధిదారులకు రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇంటి స్థలాల కోసం పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి బోడ ఆంజనేయులు, నాయకులు రావుల పోచయ్య, మాదాను బల్తరాజు, రచ్చ ఆంజనేయులు, భువనగిరి రాజు, ములుగు రాములు, ఎలిమినేటి ఐలయ్య, పల్లెర్ల లాలయ్య, అనిల్, అంజయ్య, నారికడపు శంకరయ్య, వడ్డే బోయిన మురళి పాల్గొన్నారు.

## వడ్డెర గూడెంలో ఘనంగా ఈదమ్మ బోనాలు



**ప్రజాపక్షం/డిండి;** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం వావిల్‌కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెం గ్రామంలో ప్రతి ఏడాది కన్నుల పండగలా వడ్డెరలు భక్తి శ్రద్దలతో జరుపుకునే ఈదమ్మ తల్లి బోనాల పండుగ ఈ సంవత్సరం కూడా గురువారం ఘనంగా నిర్వహించారు. ఊరి మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్ళలో కుటుం సమేతంగా అమ్మవారికి బనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరంతా బేధాభిప్రాయాలు లేకుండా ఏకతాటిపై ఈపండగను జరుపుకోవడం విశేషం, చిరకాలం తమపై అమ్మవారి ఆశీస్సులు, చల్లనీ దీవెనలు ఉండాలని పాడి పంటలతో, అన్ని విధాల ప్రజలు బాగుండేలా ఆశీర్వదించాలని గ్రామ పెద్దలు ఈదమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ బోనాల కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఓర్సు ముత్యాలు, మాజీ ఎంపిటిసి అంజయ్య, శ్రీను, వెంకటయ్య, మాజీ సర్పంచ్ వెంకటయ్య, తిరుపతయ్య, జగన్, వెంకటేష్, గణేష్, లక్ష్మీ నారాయణ, రాములు, సహదేవ్, రమేష్, బుచ్చయ్య, పెద్ద వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎస్ఎఫ్ అధ్యక్షుడు జైహిందర్ హర్షం వ్యక్తం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** 2019లో నియామకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నాలుగేళ్ళ సర్వీస్ దాటిన అందరిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నుండి గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శులుగా అయిన వారందరికి ప్రభుత్వం ఎఫెక్టివ్ డేట్ ఇవ్వకుండా రెగ్యులరైజే చేయడం వల్ల భవిష్యత్తులో సర్వీస్‌కు సంబంధించిన ఇబ్బందులు ఏర్పడతాయని తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినట్లు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు జైహిందర్ తెలిపారు. తాజాగా ప్రభుత్వం ఎఫెక్టివ్ డేట్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడంతో పంచాయతీ కార్యదర్శులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించడంతో ఈ సందర్భంగా జై హిందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయని అధికారులు, కబ్జాదారుడు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో అతి పురాతన చరిత్ర కల్గిన కొత్త బావిని రాత్రికి రాత్రే మట్టి నింపడం పై కొని రోజుల క్రితం జిల్లా కలెక్టర్ కు సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు మరికొందరితో కలిసి ఫిర్యాదు చేయగా స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ దశరథ్ కు ఫోన్ చేసి ఆక్రమణకు గురువుతన్న బావికి చుట్టు ఫినిషింగ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో కమిషనర్ పట్టించుకోకపోడం రాత్రిళ్ళు యతెచ్చగా టిప్పర్లలో మట్టిని తరలించి బావి ఆనవాలు లేకుండా మట్టితో నింపివేసాడు. సమీపంలోనే గద్వా పట్టణ పోలీస్ స్టేషన్ ఉన్నా అక్రమంగా మట్టిని తరలించి పురాతన బావిని కబ్జా చేస్తున్న పోలీసులు సైతం, ఆ వైపు దృష్టి సారించకపోవడం శోచనీయమని గద్వాల ప్రజలు వాపోతున్నారు. బావి ఆక్రమణపై ప్రజాసంఘాలు, బిజెపి నాయకులు బావిని పరిశీలించారు. పక్కనే ఫంక్షన్ హాల్ నిర్మిం,ఇ పురాతన బావిని ఆక్రమించుకునేందుకు కుట్ర పన్నుతున్నాడని, గతంలో మున్సిపల్ చైర్మన్ గా ఉన్న వ్యక్తి ఆనాటి ఆనవాళ్లు లేకుండా చేయడానికి పూనుకోవడం బాధాకరమని ప్రజలు చర్చించకుంటున్నారు అధికారులు ప్రజా ప్రతినిధులు ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకొని పురాతన కట్టడాలను పరిరక్షించాలని కోరుతున్నారు.



## ఉపాధి హామీ సామాజిక తనిఖీ

**ప్రజాపక్షం/డిండి;** 14వ విడత సామాజిక తనికీలో భాగంగా గురువారం గుండ్లపల్లి మండలం నుందు ఉపాధి హీమీ పథకంలో ఆర్థిక సంవత్సరం 2023 నుండి 2024 వరకు జరిగిన పనుల మీద తేది 18/03/2025 నుండి 26/03/2025 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో అన్ని పనులను పరిశీలించి తయారు చేసిన నివేదికలను ప్రతి గ్రామ సభలు నిర్వహించిన నివేదికలను 27/03/2025 మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించడం జరిగింది. అట్టి నివేదికల మీద నల్గొండ నుండి వచ్చిన అడిషనల్ డిఆర్‌డివో నివేదికలపై నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఎంపిడివో వెంకన్న, డివివో వేణుగోపాల్, దేవరకొండ క్లస్టర్ ఏపిడి యామిని, ఇంచార్జీ ఏపివో రాజు, ఎస్‌ఆర్‌పిలు వెంకన్న, అశోక్, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ అడిట్ బృందం పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమావేశం



**ప్రజాపక్షం/ తిరుమలగిరి సాగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న య్యం పంపిణీలో జాప్యం చేయకుండా తగు జాగ్రత్తలతో పంపిణీ చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు.తిరుమలగిరి సాగర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం గురువారం నిర్వహించారు, సమావేశంలో ఆయన మాట్లాడుతూ సన్న య్యం పథకంలో డీలర్లు నిర్వహించాల్సిన పాత్ర డీలర్లకు ఎదురయ్యే సమస్యలు తూకంలో తరుగుల గురించి చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, ఆర్ ఐ లక్ష్మీకాంత్, లక్ష్మీనారాయణ, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు జటావత్ దత్తు, డీలర్లు హను మధు నరసింహా మన్య శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌ను కలిసిన పూరి సురేష్ శెట్టి

**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** గద్వాల జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీ నారాయణ ను శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్॥ జల్లాపురం పూరి సురేష్ శెట్టి గురువారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెసి లక్ష్మి నారాయణ ను పూరి సురేష్ శెట్టి శాలువాక సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసు శ్రీధర్ రెడ్డి , లక్ష్మి నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం/ఉండవెల్లిః** అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయించి బిల్లులు చెల్లించకుండా మాజీ సర్పంచులను అప్పుల్లోకి నెట్టారని ప్రభుత్వం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇంద్ర పార్క్ దగ్గర పెండింగు బిల్లు చెల్లిస్తామని మాట ఇచ్చి నేటి వరకు బిల్లులు చెల్లించకుండా ఉండడంతో అందులో భాగంగా చలో అసెంబ్లీ ముట్టడిలో భాగంగా గురువారం నాడు పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు శేషం గౌడ్, ఏదన్నా తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి



**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 184502 మెట్రిక్ టన్నులు కాగా అందులో సన్న రకాలు 99729 మెట్రిక్ టన్నులు, దొడ్డ రకాలు 144 మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందనే అంచనాలు ఉన్నాయని, ఇందు కోసం 144 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2320,బి గ్రేడ్‌కు రూ.2300 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎవ్వరూ వడదెబ్బకు గురికాకుండా చలువ పందిళ్లు, టెంట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. క్రాప్ బుకింగ్ చేసిన ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయడం ద్వారా రద్దీ తగ్గుతుందన్నారు. జిల్లా సమీప రాష్ట్రాల నుండి ధాన్యం తరలివచ్చే అవకాశం ఉన్నందున సరిహద్దుల్లో మొత్తం 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏరోజుకా రోజు ఆన్‌లైన్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇంచార్జ్, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులంతా వారివారి విధులు తప్పకుండా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు తలెత్తినా తనకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్, రుక్మిణి, తునికలు కొలతలు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# వద్దిరాజుకు ధన్యవాదాలు తెలిపిన ఐజెయు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్లమెంటులో జర్నలిస్టులకు రాయితీపై రైల్వే పాసులు జారీ చేయాలని గతంలో ఉన్న పథకాన్ని పునరుద్దరించాలని కోరిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మంజిల్లా కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కరోనా మహమ్మారికి ముందు అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు రైలులో ప్రయాణిస్తే 50 శాతం రాయితీ ఉండేదని కరోనా అనంతరం ఆ రాయితీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. రద్దయిన 50 శాతం రాయితీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఐదేండ్లుగా టియుడబ్ల్యూజె (ఐజెయు) ఎంపిలకు విజ్ఞప్తులు చేసిందన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రేణుకాచౌదరి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తో పాటు ఖమ్మం వచ్చిన ఎంపి రఘునందన్‌రావు కు సైతం వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఐజెయు విజ్ఞప్తిని మన్నించి రాజ్యసభలో జర్నలిస్టుల పాసుల పునరుద్ధరణమై మాట్లాడిన వద్దిరాజు రవిచంద్రకు జిల్లా కమిటీ తరుపున వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఈబిసి, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆర్థికాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. 21 సం. నుండి 55 సం.ల వారి వరకు ఈ పథకానికి అర్హులని, దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని చెప్పారు.

# లారీలను రోడ్డు మీద పార్కింగ్ చేయవద్దు : డిఎస్పీ





**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు డిఎస్పీ ఆఫీసులో మణుగూరు నుండి బీటీపీఎస్ కు వెళ్ళు మార్గంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ దృష్ట్యా గురువారం ఉదయం డిఎస్పి రవిందర్ రెడ్డి స్థానిక బి టి పి ఎస్ కోల్ ట్రాన్స్పోర్ట్ ఆర్ఐ, సింగరేణి సంస్థ ఎస్ఓ, గోల్డ్ ట్రాన్స్పోర్ట్ చేస్తున్న లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మరియు మెంబర్స్ తోటి ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ పలు సూచనలు చేశారు. బిటిపిఎస్ గేట్ నుండి 400 మీటర్ల వరకు ఇరువైపులా రోడ్డుకి లారీలు పార్కింగ్ చేయకుండా వారికి ప్రత్యేకంగా ఒక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది. అందుకుగాను బీటీపీఎస్ వారు దానికి అంగీకరించి రోడ్డుమీద పార్కింగ్ చేయకుండా రోడ్డుకి ఇరువైపులా 400 మీటర్ల వరకు ప్రత్యేకంగా వాహనాలు నింపుకోవడానికి పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వాళ్లకు రాజుపేట క్రాస్ రోడ్ వద్ద నుండి సింగరేణి బొగ్గు లారీలకు అడ్డుగా ఏర్పడకుండా అక్కడ పార్కింగ్ చేయవద్దని వారికి సూచించిన పార్కింగ్ ప్లేస్ లోనే వాహనాలని పార్కింగ్ చేయాలని రోడ్డుమీద ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను పార్కింగ్ చేయరాదని చెప్పడం జరిగింది. ఒకవేళ పార్కింగ్ చేసినట్లయితే వారిపై చట్టరీత్యా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలకుండా ట్రాఫిక్ ను సరైన రీతిలో వెళ్లేలా చూడాలని లారీ అసోసియేషన్ మెంబర్స్ కు చెప్పడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు కొత్తగా మణుగూరులో ఇసుక రీచ్ లో నుండి నిత్యం చాలా లారీలు వెళ్తుంటాయి కావున దయచేసి ప్రజలకు మరియు వాహనాలకు ఇబ్బంది కలగకుండా లారీలను రోడ్డు మీద పార్కింగ్ చేయవద్దని పోలీసులకు సహకరించాలని లేనియెడల చట్టరీత్యా తీవ్రమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ నుండి శ్రీనివాస్ ఎస్ ఓ, బి టి పి ఎస్ నుండి కోల్ ట్రాన్స్‌పోర్ట్ డి నాయుడు, లారీ అసోసియేషన్ 14 టైర్స్, 12 టైర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/బోనకల్ :** మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్నలను కొనుగోలు చేయాలని, మొక్కజొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం ముష్టికుంట గ్రామంలో ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కర్‌రావు తో కలిసి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు ఇప్పటికీ ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, జయరాజు, రామారావు, సత్యం, బాబురావు తదితరులున్నారు.

# ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలి



**-తహసీల్దార్‌కు మాస్ లైన్ వినతి**

**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలో పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని, బోధకాలు బాధితులకు వికలాంగులుగా గుర్తించాలని, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని ఎన్నికల నాడు పెన్షన్లు పెంచుతానన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కారేపల్లి కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎన్వి రాకేష్‌లు డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా మాస్ లైన్ సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులు ఆసరా పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ గురువారం కారేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పాషాకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు కుమ్మరి సందీప్, ఎన్‌వి రాకేష్‌లు మాట్లాడుతూ పెంచి ఇస్తామన్న పెన్షన్ కూడా ఇంత వరకు అమలు చేయలేదని, ఖమ్మం జిల్లాలకు బలమైన ముగ్గురు మంత్రులు ఉండి ఏం ప్రయోజనం అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో నిధులు పెంచకపోగా చేయుటకు ఇవ్వాల్సిన నిధులను ఇతర రంగాలకి మార్చి ఈ బాధితులను అన్యాయం చేయటం ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెన్షనర్ దారులందరికి నూతన పెన్షన్లను, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాస్ లైన్ మండల నాయకులు పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి వీరన్న, కొయ్యల శ్రీను, తాటి పాపారావు, చల్లా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపులను పరిశీలించిన డిఎస్‌వో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రేషన్ షాపులను జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కె. చందన్‌కుమార్ పరిశీలించారు. గురువారం ఖమ్మం నగరంలోని సారధినగర్‌లో రెండు రేషన్ దుకాణాలను, బొక్కలగడ్డలో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయా దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించి రికార్డు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుందని ఆయన తెలిపారు. అన్ని రేషన్ దుకాణాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి సన్న బియ్యం సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటి విజయబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 29న దుకాణ సముదాయాల అద్దెకు వేలం





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల ప్రజాపరిషత్ ఆధీనంలో ఉన్న వీడీవో క్వార్టర్స్, లక్ష్మి మహిళా మండలి కాంప్లెక్స్ లను అద్దెకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. గురువారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న మూడు వీడీవో క్వార్టర్స్, రెండు మహిళా మండలి దుకాణ సముదాయములను ఈ నెల 29న అద్దె కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 26, మరియు 202627 సంవత్సరాలకు గాను, అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి

ప్రజాపక్షం/ఖమ్మం : అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వమే న్యాయం చేయాలని రాష్ట్ర అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు యర్రాబాబు, తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కమిటీ సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, యర్రాబాబు మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేస్తే ఎక్కువ లాభాలు ఉంటాయని నమ్మించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు రూ.5వేల కోట్లు వసూలు చేసి ప్రజల సొమ్ముతో పలు కంపెనీలు ప్రారంభించారని, స్థలాలు కొన్నారని, రిసార్ట్స్ నిర్మించారని వారు తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు నగదు తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు అగ్రిగోల్డ్ కంపెనీ చేతులెత్తేసిందన్నారు. బాధితులు ఆందోళన చేయడంతో కంపెనీకి సంబంధించిన బాధ్యులను అరెస్టు చేసి ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయని వారు ఆరోపించారు. అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన తెలంగాణ ప్రజల సొమ్ము రూ. 500 కోట్లు ఉంటుందని అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు




న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దానిని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎన్. సునీత, వీరబ్రహ్మాచారి, ఎస్‌డి పాషా, లక్ష్మీ నారాయణ, సతీష్, రాజు, కృష్ణయ్య, లక్ష్మి, అనసూర్య, రమాదేవి, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు

### విజేతలుగా బద్దం శ్రీనివాస్ రెడ్డి, చిర్రా రవి కుమార్, యామ (దాసరి) కవిత

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ఉదయం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి బద్దం శ్రీనివాస్ రెడ్డి 19 ఓట్లు సాధించి 3 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జనరల్ సెక్రటరీగా చిర్రా రవి కుమార్ 23 ఓట్లు పొందగా, 4 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే విధంగా వైస్ ప్రెసిడెంట్‌గా యామ (దాసరి) కవిత 23 ఓట్లు సాధించి, 4 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ ఎన్నికలకు కె. వీర మధుసూదన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.



# ముత్యాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి వార్షిక జాతరను గురువారం ఘనంగా ప్రారంభించారు. ముత్యాలమ్మ అమ్మవారిని మహాలక్ష్మీ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు మేడూరి సాంబశివప్రసాద్ శర్మ వేదమంత్రాల నడుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తల మండల అధ్యక్షులు నారల శ్రీనివాస్ ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజ, అభిషేకం, అలంకరణ, అఖండదీపారాధన, చండీపారాయణం, నివేదన, నీరాజన, మంత్ర పుష్పం, సాయంత్రం అర్చనలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ సూర్యప్రకాశరావు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాపక్షం/ఖమ్మం : రాష్ట్రంలో విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్, ఇంటర్మీడియట్ కళాశాలలు 2025 26 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ అన్నారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్, కళాశాలల్లో అప్పుడే అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. ముందస్తుగా చేరితే అడ్మిషన్ ఫీజులో రాయితీ అంటూ తల్లిదండ్రులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రకరకాల పేర్లతో ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ అడ్మిషన్ల పేరుతో ప్రత్యేక దస్తాలు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం ఆవైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. చెబుతున్న ఫీజు ఒకటి, వసూలు చేసే ఫీజు మరో విధంగా




ఉందని రామకృష్ణ ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే అనుమతులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు మొద్దునిద్ర వీడి ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ పక్షాన ఆందోళనలు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, గోపి, ప్రతాప్, గణేష్, రవి, రాకేష్, ఉమామహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిజ్ఞ రచయితకు గుర్తింపు తేవాలి

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : నిత్యం విద్యార్థులు పాఠశాలల్లో ఆలపించే భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞను పైడిమర్రి వెంకటసుబ్బారావు రాశారని, ఆయన ఖమ్మం జిల్లాలో కూడా ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారని, ఎటువంటి గుర్తింపుకు నోచుకోని పైడిమర్రికి తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేయాలని రచయిత ఎం.రాంప్రసాద్ గురువారం మండల తహశీల్దార్ ఎం.ఉషా శారదకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తాను రాసిన పైడిమర్రి జీవిత చరిత్రను ఆమెకు బహుకరించారు.



# సందడిగా నాగులమ్మ జాతర

**-అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తజనం**
**-నాగులమ్మ తల్లి కళ్యాణ వైభోగం**
**-అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం**



ప్రజాపక్షం/పినపాక: మండల పరిధిలోని జానంపేట గ్రామంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన నాగులమ్మ జాతర మూడు రోజులుగా ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. గురువారం గుట్ట నుండి నాగదేవత గుడికి వచ్చే కార్యక్రమం ఎంతో అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా నాగదేవతను గోదావరి పుణ్యస్నానం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. అర్ధరాత్రి నాగదేవత కళ్యాణం ఎంతో అంగరంగ వైభవంగా జరగనుంది. కళ్యాణం అనంతరం అమ్మవారు అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం నిర్వహిస్తామని దేవరపాల జనార్ధన్ తెలిపారు. ఆలయానికి అనేక గ్రామాల నుండి విచ్చేసిన భక్తులతో జనసంద్రంగా మారింది. అమ్మవారు దీవెనలు తీసుకున్నారు. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించే కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం నాగులమ్మ తల్లి గుడి నుండి గుట్టకు వెళ్లే కార్యక్రమం తో జాతర ముగుస్తుంది. దూర ప్రాంతాల నుండి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగస్వాములవు తున్నారు.

# కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

### -పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమీషనర్

ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు కొనసాగుతున్నాయి. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 3, 5, 11 వార్డుల్లో శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులు నిర్వహించారు. ఈ శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులను మున్సిపల్ కమీషనర్ చింతావేణు పర్యవేక్షించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులపట్ల ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు రెండు రోజులుగా వార్డుల్లో శానిటేషన్ గ్యాంగ్ వర్క్ ఏవిధంగా నడుస్తుంది. ఏఏప్రాంతాల్లో నిర్వహిస్తున్నారని అనేది ప్రత్యేకంగా ఆయన సమాచారాన్ని తీసుకోవడం జరుగుతుంది. పారిశుద్ధ్య పనులపట్ల నిర్లక్ష్యం వహించవద్దని ప్రతిరోజు వార్డుల వారీగా పనులు నిర్వహించాలని తెలిపారు. వ్యర్థపదార్థాలు రోడ్ల పక్కన ఎక్కడా డంపు చేయకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆదేశించారు.



# యువతను విస్మరిస్తున్న పాలకులు

### -ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధి కోసం ఆందోళన

ప్రజాపక్షం/కారేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభాలో సగభాగమున్న యువతను విస్మరిస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని సీతారామపురంలో పునెం రామచంద్రు అధ్యక్షతన ఏఐవైఎఫ్ గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దోజు శ్రావణ్ మాట్లాడుతూ పాలకుల వైఖరి కారణంగా దేశంలో యువశక్తి నిర్వీర్యమవుతుందని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత నైరాశ్యంలో ఉందన్నారు.యేటా రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న మోడీ కనీసం వెయ్యి ఉద్యోగాలు కూడా కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వట్టిపోతున్నాయని శ్రావణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకులకు ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదని కేసీఆర్ మాటల మాదిరే కాంగ్రెస్ నిరుద్యోగ భృతి కూడా అటకెక్కిందని ఆయన తెలిపారు.




ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం పోరాడాలని ఆయన కోరారు. అఖిల భారత యువజన సమాఖ్య నేతృత్వంలో యువజనోద్యమ నిర్మాణం జరగనుందని శ్రావణ్ తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ నాయకులు చిన్నంశెట్టి భూషయ్య, నాయకులు నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి నలుగురు డాక్టర్లు నియామకం

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి నలుగురు స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంతో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేక చొరవతో డిసిహెచ్ఎస్ రవిబాబు కృషితో స్పెషలిస్టు వైద్యులను తీసుకువచ్చారు. గైన్కాలజిస్ట్ ఒకరు, ఎముకల డాక్టర్ ఒకరు మొత్తం నలుగురు వైద్యులు నియమించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ రుక్మిణి తెలిపారు.

